దీప మరోసారి సుతారంగా నవ్వి. "ఆయన వచ్చేసరికి ఆలస్యమవుతుందేమో. రండి. మా ఇల్లు చూపిస్తాను" అంది దీప.

టీ త్రాగిన తర్వాత దీపతో గదులు చూడ్డానికి లేచాడు దిలీప్.

"ఇది మా వంట గది."

"చాలా బావుంది."

"ఇటు రండి. ఇది మా గెస్ట్ రూం."

"చాలా బావుంది."

"ఇదిగో. ఇది ఈమధ్యనే కొన్నాం" టేప్ రికార్డర్. కలర్ టీవీ చూపించింది.

"చాలా బావుంది!"

దీప నవ్వింది.

"అటు వెడదాం. రండి."

ఇద్దరూ ప్రక్క ప్రక్కనే నడుచుకుంటూ మరో గదిలోకెళ్ళారు.

"ఇది మా బెడ్ రూమ్" నవ్వుతూ అంది దీప.

"చాలా బావుంది."

"మీకన్నీ బాగానే వున్నాయా?"

"అవును దీపా. మీతోపాటే ఇవన్నీ బావున్నాయి" అంటూ దీప చేతిని మృదువుగా పట్టుకున్నాడు దిలీప్.

దీప ఆ చేతిని విడిపించుకోవడానికి ప్రయత్నం చేసింది - కానీ దిలీప్ ఆమె చేతిని గట్టిగా పట్టుకుని- "ప్రియమైన దీపా! ఐ లవ్ యు" అంటూ ఆమె భుజంమీద చెయ్యి వేసి దగ్గరకు లాక్కున్నాడు అంతే!

టైమెంతయిందో తెలియదుగానీ ఆ గదిలోకి సన్నటి వెన్నెల మాత్రం పరుచుకుంది కిటికీగుండా. వచ్చటి ముఖమల్ దుప్పటిమీద దిలీప్. దీపా పడుకుని వున్నారు. నగ్నంగా పడుకున్న వారి శరీరాల మీద వెన్నెల హాయిగా విశ్రాంతి తీసుకుంటోంది!

"మీరీ సహాయం చేసిపెడితే మిమ్మల్ని జన్మలో మరచిపోలేను. మీ ఆసరాతో మా కుటుంబం కూడా ఒక స్టేటస్‌కి వస్తుంది."

"ష్యూర్. తప్పకుండా దీపా! రేపే లక్ష రూపాయలు యిచ్చేస్తాను. ఇంత డబ్బు ఎక్కడిదని ప్రకాష్‌కు అనుమానం రాదా?"

"ఆ విషయాలు నేను చూసుకుంటాను."

"అలాగే. లక్ష రూపాయలు తప్పకుండా రేపిస్తాను. మరి నే వెళ్ళరానా."

"రేపు కలుస్తావుగదా డియర్" దిలీప్ లేచి మరోసారి దీపను ముద్దుపెట్టుకుని వెళ్ళిపోయాడు.

*     *     *

"ఇదిగో ప్రకాష్! దిలీప్ ఇచ్చిన లక్ష రూపాయలు. నావాటా నాకిస్తే నే వెళ్ళిపోతాను."

"తప్పకుండా దీపా! నాకోసం శ్రమపడి ఆంధ్రాలో ఎక్కడో మారుమూల వున్న గ్రామంనించి వచ్చి నా భార్యగా చాలా చక్కగా నటించావ్. చదువుకుని వుద్యోగం రాక. కుటుంబాన్ని పోషించడంకోసం ఇలా భార్యగా నటించడం. నీలాటి వారికి పరాయి రాష్ట్రాల్లో చాలా తేలిక. మళ్ళీ ఎప్పుడైనా అవసరం వొస్తే నీ దగ్గరకే వొస్తాను. ఇక్కడి వారి దృష్టిలో నువ్వు పుట్టింటికెళ్ళినట్టు. ఇక్కడి వాతావరణం. నీళ్ళు నీకు పడలేదు. కొంతకాలం పోయినతర్వాత మళ్ళా వొస్తావ్. ఇదీ నీ గురించి నే చెప్పే కథ." అన్నాడు ప్రకాష్.

"చాలా బావుంది ప్రకాష్. నేనీ రాత్రికే వెళ్ళిపోతాను."

"అలాగే"

ప్రకాష్ ఇచ్చిన పాతిక వేల రూపాయలు సూట్‌కేస్‌లో సర్దుకుంది దీప.

దిలీప్ తన ఎ.సి. గదిలో కూర్చుని పకపకా నవ్వుకుంటున్నాడు - మరో లక్ష రూపాయల దొంగనోట్లు మార్కెట్‌లోకి వెళ్ళినందుకు దీప ద్వారా!

*     *     *

ప్రతి మనిషీ బ్రతకడానికి కష్టపడాలి. దిలీప్‌లా. దీపలా బ్రతకడం కూడా ఒక కష్టమే అదీజీవితమే అనేవాళ్ళు వుండొచ్చు. అలా అనుకునే వారికో నమస్కారం!

*

# విశ్వమే ఏకమై

-కె. అరుణావ్యాస్

"కేర్... కేర్.. క్వువ్వా. హువ్వువ్వా."

పసిపాప భూమి మీదపడ్డ మరుక్షణం తన అస్తిత్వాన్ని లోకానికి చాటే యత్నం. ఇచ్చే సంకేతం.... పురిటినెప్పుల సాకల్యం. మాతృత్వ సాఫల్యం స్త్రీత్వ సార్థక్యం. క్రొత్త సృష్టి. తినరాని పండు పుట్టె.. తీపి తీపి.. పుడమీ ప్రాణీ. తల్లీ బిడ్డా..... బోన్ ఆఫ్ మై బోన్. ఫ్లెష్ ఆఫ్ మై ఫ్లెష్.... తల్లి పొత్తిళ్ళలో దాగి. చీర కుచ్చిళ్ళలో ఇమిడి. పాలగుండెల్లో ఒదిగి.. సృష్టికర్తా సృష్టి....తల్లీ బిడ్డా.... ఆనందం తెరలై. పొరలై అలలై అర్ణవమై ఆహ్లాద తరంగ దోలికా సయ్యాట. పసిపాప కేరింతల పాట ధారలై పీయూష....తన్మయిస్తూ యోష! ఈ చిన్నారి ఎదిగీ .... స్థిరమై .... చిరమై .... మరో షేక్స్‌పియర్ మరొక అయిన్‌స్టీన్ ఐతే.... ఆశల సౌధాలు అంబరపరిమాణమై.... ఇల్లంతా ఉత్సాహం.... విందుదనం.... సందడి .... వడివడిగా....పరుగిడగా ఎవ్విర్ థింగ్ ఈజ్ రైట్ విత్ ది వరల్డ్.

అంతలో .... హఠాత్తుగా ఆకాశాన్ని త్రుంచుతూ అశనిపాతంలా భయంకర మృత్యు కరాళ దంష్ట్రి ఈ ఉత్తేజాన్ని.... ఈ చైతన్యాన్ని.... ఈ సంరంభాన్ని.... కాటువేస్తే -

మూగవోయిన గొంతుకా... ఆగిపోయిన గుండెకాయ....మూత పడిన కళ్ళు.... ఆరిపోయిన ఊపిరి కొడిగట్టిన దీపం....మంచు ముక్క సారూప్యం.... త్రుళ్ళుతూ.... గెంతుతూ.... దుమికే చరత్వం జడమై.... అచలమై.... అస్థిరమై.... అశాశ్వతమైతే ఇంటెల్లిపాదినీ ఉత్తేజపరచిన చైతన్యం.... నిస్తేజమై....నిశ్చలమై....నిర్వికారమైఅబద్ధమైతే ... సచేతనమూ. సహేతుకమూ సజీవమూ అయిన మేధ-సృష్టిలోనే ఉత్తమ సృష్టి- పారగాన్ ఆఫ్ ఆల్ యానిమల్స్— తీరా చూస్తే ఏముందీ .. ?పిడికెడు మట్టిలో గుప్పెడు బూడిద— ఓహ్! గాడ్! వై పిక్ ఆన్ మి? జడిగా... గడబిడగా.... తడి గుండెలు తడబడగా.... మాతృమూర్తి రోదన.... సుడితిరిగే ఆక్రందన.... జీవుని వేదన ..... ప్రాణి యాతన..... దుర్భరమైన ఈ నిజం అబద్ధం కావాలనే తపన ఆవేశం.. ఆక్రోశం. .ఆరాటం .. చేష్టలు దక్కి. మాటలు కట్టి స్తబ్దత.... నిశ్శబ్దత... చేతస్సులోని రోచిస్సు....గాలివాటు దీపమేనా? అంతేనా ? ? ?

వాట్ ఎ పీస్ ఆఫ్ వర్క్ ఈజ్ మాన్! హౌ నోబుల్ ఇన్ రీజన్! హౌ ఇన్‌ఫినిట్ ఇన్ ఫాకల్టీ!

అనంతమైన విశ్వంలో ఏ మూలో చేతనత్వం.... బియాండ్ ది హొరైజన్....

సోలార్ సిస్టమ్ స్టెల్లార్ సిస్టమ్
ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్
హౌ ఐ వండర్ వాట్ యు ఆర్

ఎక్కడో.... ఏ రూపంలోనో.... చలనం.... కదలిక.... "దివిజకవివరు గుండియల్ దిగ్గురనగ" సజీవమూ.... సచేతనమైన.... మేధ.... సుదూరంగా.... సుదీర్ఘంగా రోదస్సులోనికి పయనమై.... పవనమై.... సింగిల్ సెల్ మల్టిపుల్ సెల్స్ జైగోట్ ఫీటస్-ఇన్‌ఫాంటిసిపేషన్.

స్త్రీత్వం.... మాతృత్వం.... విశ్వం.... ప్రాణీ.... తల్లీ.... బిడ్డా....

ఓ తల్లి కడుపు పండి.... కేర్.... క్వువ్వా.... హువ్వువ్వా....

అది ప్రణవం